ట్యాంకర్ నీటితో దద్దుర్లు

అందని మిషన్ భగీరథ నీరు
- డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీకి తిప్పలు
- వేసవికి ముందే నీటికి కటకట


కురవిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీ


కాలనీలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్

కురవి : గిరిజన కాలనీకి మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో అందడం లేదు.. దీంతో ట్యాంకర్ నీరు తాగడం వల్ల శరీరంపై దద్దుర్లు ఏర్పడుతున్నాయి. దీంతో ఎండకాలం రాకముందే తాగునీటికి కటకట తలెత్తింది. మండల కేంద్రంలో గిరిజనుల కోసం కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీకి తాగునీటి తిప్పలు తప్పడం లేదు. చెంచు, ఎరుకల (ఏకలవ్య కులస్తులు) గిరిజనులకు గత ప్రభుత్వం 30 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇచ్చారు. కాలనీలో అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. 30ఇళ్లను హడావిడిగా గిరిజనులకు కేటాయించి 2022 ఏప్రిల్ 19వ తేదీన పట్టాలు ఇచ్చి గృహప్రవేశం చేయించారు. అయితే కాలనీకి వెళ్లిన గిరిజనులకు అధికారులు కనీస సౌకర్యాలను కల్పించడం మర్చిపోయారు.

అందని భగీరథ తాగునీరు..

కాలనీకి మిషన్ భగీరథ తాగునీరు అందడంలేదు. దీంతో కాలనీవాసులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భగీరథ నీరు రాకపోవడంతో గ్రామ పంచాయతీ తరఫున ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. ట్యాంకర్ ద్వారా అందించే నీరు తాగేందుకు పనికి రావడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి సమస్యతో పాటు విద్యుత్ సౌకర్యం లేదు. గ్రామ పంచాయతీ నుంచి ఇప్పటి వరకు ఇంటినంబర్లు కేటాయించ లేదు. అంతర్గత రోడ్లు లేక అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే కాలనీ మొత్తం జలమయమవుతోంది. పట్టాలు ఇచ్చినప్పటికి ఇంటి నంబర్లు లేక విద్యుత్ మీటర్లు లేకుండా పోయాయి. సైడ్ డ్రైయినేజీలు లేకపోవడంతో ఇళ్లల్లో వాడుకునే నీరంతా ఇళ్ల ఎదుట నిలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నీళ్లు తాగితే దద్దుర్లు వస్తున్నాయి



మా కాలనీకి భగీరథ నీళ్లు రావడంలేదు. గ్రామ పంచాయతీ సిబ్బంది ట్యాంకర్‌తో నీళ్లు ఇస్తున్నారు. ఆ నీటిని తాగితే ఒంటిపై దద్దుర్లు వస్తున్నాయి. నా కొడుకు శరీరంపై మొత్తం దద్దుర్లు రావడంతో బాధపడుతున్నాడు. మా ఇంట్లో అందరికి దద్దుర్లు వచ్చాయి. తాగేందుకు భగీరథ నీళ్లు అందించాలి.

– గుజ్జుల నవీన్, కాలనీవాసి

క్లుప్తంగా

కాల్వ పూడిస్తే చర్యలు
- ఐబీ డీఈ రాందాస్



నెల్లికుదురు : ఎస్సారెస్పీ కాల్వను పూడిస్తే కఠిన చర్యలు తప్పవని ఐబీ డీఈ రాందాస్ హెచ్చరించారు. మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చెందిన పిడుగు వెంకన్న, రుద్రారపు రవి తమ వ్యవసాయ భూముల మధ్య నుంచి ఎస్సారెస్పీ ఉప కాల్వను వెళ్లిందని వారంరోజుల క్రితం రాత్రికి రాత్రే కాల్వను పూడ్చినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఐబీడీఈ రాందాస్ కాల్వను పరిశీలించి, వారిని ఎందుకు పూడ్చారని ప్రశ్నించారు. ఇద్దరిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు డీఈ తెలిపారు.

లైన్‌మెన్ల సేవలు ఎనలేనివి



పెద్దవంగర : విద్యుత్ లైన్‌మెన్ల సేవలు ఎనలేనివని డీఈ మధుసూదన్, ఏఈ రమేశ్ బాబు కొనియాడారు. మంగళవారం మండలంలోని వడ్డెకొత్తపల్లి సబ్ స్టేషన్‌లో జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్,అసిస్టెంట్ లైన్‌మెన్లకు మెమోంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ చలపతిరావు, విద్యుత్ అధికారులు నిహాల్, మనోహర్, రవి కుమార్, వీరన్న, పవన్ కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

డోర్నకల్ /నెల్లికుదురు /గార్ల : ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, గార్ల కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి మంగళవారం తెలిపారు. డోర్నకల్‌లోని ఆయా కళాశాలల్లో నేటినుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అగ్నికి ఆహుతైన ఆయిల్‌పామ్ మొక్కలు


కాలిపోయిన ఆయిల్‌పామ్ మొక్కలు

దంతాలపల్లి : సుమారు 50 ఆయిల్‌పామ్ మొక్కలు అగ్నికి ఆహుతైన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. గున్నెపల్లి గ్రామానికి చెందిన రైతు కడుదుల మధుకర్ రెడ్డి తోటలో ఆయిల్‌పామ్ మొక్కలు కాలిపోవడం చూసిన స్థానికులు సదరు రైతుకు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న రైతు అగ్నిమాపక సిబ్బంది సాయంలో మంటలార్పడంతో ప్రమాదం తప్పింది. ఆయిల్‌పామ్ చెట్లతో పాటు పైపులు మంటల్లో కాలిపోయినట్లు రైతు తెలిపాడు. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు మధుకర్ రెడ్డి పేర్కొన్నారు.

తునికాకు టెండర్లు నిర్వహించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్డీ, ఏఐకేఎంఎస్ నాయకులు

గూడూరు : రాష్ట్ర ప్రభుత్వం అన్ని యూనిట్లలో తునికాకు టెండర్లు నిర్వహించి, తక్షణమే ప్రూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. మండలంలో ర్యాలీ నిర్వహించి, గజ్జి లింగన్న అధ్యక్షతన మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ 50 ఆకుల తునికాకు కట్టకు ప్రభుత్వం రూ.5 చెల్లించాలన్నారు. అనంతరం ఎఫ్ఆర్వో సురేష్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు వెంకటేశ్వర్లు, దేవేందర్, అచ్చన్న, వజ్జన్న, వెంకన్న, రజిత, సమ్మయ్య, నర్సయ్య, వెంకన్న, వీరస్వామి, పాపయ్య, సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నల్లచట్టాలను రద్దు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గార్ల : రైతు వ్యతిరేక నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గార్లలో వామపక్షాలు, ఎస్‌కేఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం నాడు ఢిల్లీ కేంద్రంలో జరిగిన రైతాంగ పోరాటానికి తలొగ్గి నల్ల చట్టాలను రద్దు చేస్తామని, కనీస మద్దతుధర చట్టం తీసుకొస్తామని, నేటికీ అమలు చేయక పోవడం తగదన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, జి.సక్రు, శ్రీనివాస్, సత్యవతి, వెంకన్న లోకేశ్వరరావు, మనోహర్, వీరస్వామి, రామకృష్ణ, మహేశ్వరరావు, నాగేశ్వరరావు, నాగరాజు, శంకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన మహిళా కాంగ్రెస్ నేతలు


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న మహిళా నేతలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను మహిళా కాంగ్రెస్ నేతలు జిల్లా కేంద్రంలోని మంగళవారం మర్యాదపూర్వంగా కలిశారు. నూతనంగా నియామకమైన పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనంతుల రాజమ్మ, ఇనుగుర్తి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత ఈ సందర్భంగా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మహిళా నేతలు ఎంపీకి వినతిపత్రం అందజేశారు.వారిని ఎంపీ అభినందించి మహిళా కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు భూక్య విజయ, లింగోజు సరస్వతి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్ : హోలీకి మస్తి రంగోలి వేడుకలు ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్నామని కార్యక్రమ నిర్వాహకులు బానోత్ నరేష్, నూనావత్ రాజేష్, బానోత్ దేవేందర్ అన్నారు. ఈ వేడుకల పోస్టర్లను ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ సోమవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.

శ్రీపాల్‌రెడ్డి గెలుపుతో సంబురాలు


మహబూబాబాద్ అర్బన్: బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకుంటున్న పీఆర్టీయూ నాయకులు

మహబూబాబాద్ అర్బన్/బయ్యారం /నర్సింహులపేట/ డోర్నకల్/నెల్లికుదురు /గార్ల : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి గెలుపొందడంతో మానుకోట జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో మంగళవారం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా భద్రీనారాయణ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా భద్రీనారాయణ మాట్లాడుతూ.. 54 ఏళ్ల కాలంలో పీఆర్టీయూ ఎన్నో జీఓలు సాధించిందని, రాబోయే రోజుల్లో పీఆర్సీ, పెండింగ్ డీఏలను విడుదలకు, సీపీఎస్ రద్దుకు కృషి చేస్తోందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురికి ఆరునెలల జైలు, జరిమానా

మహబూబాబాద్ రూరల్ : భూతగాదా విషయంలో ముగ్గురికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ మహబూబాబాద్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ యు.తిరుపతి మంగళవారం తీర్పు ఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి హన్మకొండ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండలం కస్నాతండా శివారు బోడ మంజ్యా తండాకు చెందిన బోడ సాములు, అతడి అన్న కుమారులు అనిల్, రాములు 2019 జూలై 6వ తేదీన అదే తండాకు చెందిన బోడ మల్సూర్, వీరన్న, జగ్గు కలిసి భూ తగాదా విషయంలో దాడిచేసి గాయపరిచారు. బాధితుడు బోడ సాములు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సాక్షులను విచారించి కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ జె.శ్యాంసుందర్ విచారించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ప్రస్తుత సీఐ బి.రాజేష్, ఎస్సైలు ఉమ, వంశీధర్ ఆధ్వర్యంలో సీడీఓ నవీన్ కుమార్ కేసుకు సంబంధించి 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జయలత కోర్టులో వాదనలు వినిపించగా నేరం రుజువైంది. మల్సూర్, వీరన్న, జగ్గు ముగ్గురికి ఆరు నెలల చొప్పున జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు.

ముగ్గురిపై కేసు నమోదు

మరిపెడ రూరల్ : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి మృతికి కారణమైన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బొలగాని సతీష్ మంగళవారం తెలిపారు. మండలంలోని పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన జర్పుల శ్రీను, బానోత్ బాలు, బానోత్ యోగి, జర్పుల శశి కలిసి ఆకేరు వాగులో చేపల వేటకు వెళ్లారు. అక్కడ విద్యుత్‌తో చేపల వేట చేస్తుండగా శశి ఛాతికి కరెంట్ తీగ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నిర్లక్ష్యం వహించి యువకుడి మృతికి కారకులైన శ్రీను, బాలు, యోగిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

నర్సింహులపేట : మండలంలోని అజ్మీరా తండాకు చెందిన పేదవిద్యార్థి అజ్మీరా నందిని చదువుకోసం దాతలు రూ.55,500ల సాయం చేశారు. నందిని తండ్రి లచ్చిరాం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. చదువు కోసం డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన గ్రామ పంచాయతీ పరిధిలోని ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులు, తదితరులు విద్యార్థి చదువుకోసం మంగళవారం చేయూతనిచ్చారు. అజ్మీరా మోహన్, సునీత, ఝాన్సీ, నగేష్, సేవ్య, వీరన్న, రెడ్డి, నరేష్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుండాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీఎస్‌టీటీఎఫ్ బాధ్యులు

బయ్యారం : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్‌టీటీఎఫ్ ముందుండాలని ఎంఈఓ దేవేంద్రాచారి అన్నారు. టీఎస్‌టీటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్ క్యాలెండర్, స్టిక్కర్లను మంగళవారం ఆవిష్కరించారు. భద్రునాయక్, బిచ్చనాయక్, బాషాసింగ్, బాలాజీ, మల్సూర్, భాస్కర్, కిషన్, రాము, వెంకన్న, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి నిఘా నేత్రాలు



సాక్షి ఎఫెక్ట్..

గూడూరు : మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న నిఘా నేత్రాలను (సీసీ కెమెరాలు) మరమ్మతులు చేయించి మంగళవారం నుంచి వినియోగంలోకి తెచ్చినట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి తెలిపారు. 'పని చేయని నిఘానేత్రాలు' అనే కథనాన్ని గతంలో సాక్షి ప్రచురించింది. స్పందించిన పోలీసులు మండల కేంద్రంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చారు.

సాగునీరు అందించాలి

నెల్లికుదురు : యాసంగి పంటలకు సాగు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీఓ బాలరాజు తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రంజాన్ పండుగ సందర్భంగా మసీదు పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలని తెలిపారు. ఏఓ యాస్మీన్, నాయబ్ తహసీల్దార్, ఎంపీఓ, ఐబీ ఏఈ, నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖ ఏఈఓలు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి: కమిషనర్ ఎన్.రవీందర్

మహబూబాబాద్ : ఈనెల 31వ తేదీలోపు ట్రేడ్ లైసెన్స్ ముగుస్తోందని వెంటనే రెన్యువల్ చేసుకోవాలని, అలాగే అక్రమ లేఅవుట్ ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నోముల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యువల్ చేసుకుంటే లైసెన్స్ జారీ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ట్రేడ్ లైసెన్స్ పన్నును మీసేవ కేంద్రాల్లో, నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డు ద్వారా కూడా చెల్లించవచ్చని కమిషనర్ వివరించారు.

సామాజిక తనిఖీ



గూడూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని డీఆర్డీఓ మధుసూదన్‌రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 39 జీపీలలో జరిగిన పనులపై తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఈ బండి మన్మోహన్ రెడ్డి, విజిలెన్స్ అధికారి వాసుదేవరావు, ఆడం, ఎంపీడీఓ వీరస్వామి, ఏపీఓ బస్సీలాల్ పాల్గొన్నారు.

'చంద్రబోస్ ఆశయసాధనకు పాటుపడుదాం'

నెహ్రూసెంటర్ : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర మాజీ కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు పాటుపడాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతి పోస్టర్లను అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. రవి, ప్రభాకర్, ప్రభాకర్, వీరన్న, సూర్యం, సత్యం, యాకయ్య, యాకయ్య పాల్గొన్నారు.

'భయాందోళనకు గురికావొద్దు'

నెహ్రూసెంటర్ : మున్సిపల్ పరిధిలో దొంగలు, అపరిచిత వ్యక్తుల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నందున సీపీఐ బృందం మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా 22వ వార్డు మాజీ కౌన్సిలర్ బి.అజయ్‌సారధిరెడ్డి మాట్లాడారు. ప్రజలకు రక్షణ కల్పించేలా పోలీసులు గస్తీ పెంచేలా చూస్తానని పేర్కొన్నారు. వార్డులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సంస్కృతిని తెలుసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులు దేశ సంస్కృతిని తెలుసుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏక్ భారత్.. శ్రేష్ఠభారత్ కార్యక్రమం నిర్వహిస్తోందని ప్రభుత్వ పాఠశాల పర్యాటక ఉపాధ్యాయురాలు డోలి గిరిజ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థులు మంగళవారం క్షేత్ర పర్యటనలో భాగంగా కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. హర్యానా రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయ వేషధారణలో అలరించారు. ఉపాధ్యాయులు విజయలక్ష్మి, వీణా, రంజాన్‌అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎంసీ నాయకులపై చర్యలు తీసుకోవాలి



మహబూబాబాద్ అర్బన్ : పశ్చిమబెంగాల్‌లోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ విద్యార్థులపై దాడికి పాల్పడిన టీఎంసీ నాయకులపై చర్య తీసుకో వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు అన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం నిరసన చేశారు. పట్టణ కార్యదర్శి గుండ్ల రాకేష్, జిల్లా నాయకులు అరుణ్, చందు, దేవేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా..



తొర్రూరు రూరల్/పెద్దవంగర : పాలకుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఆ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు.. మంగళవారం మండలంలోని వెంకటాపురం, అరిపిరాల గ్రామాల్లో నిమ్మల లలిత, సోమనర్సయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. కొడకొండ్ల ఏఎంసీ డైరెక్టర్ కుందూరు మదన్‌మోహన్ రెడ్డి తల్లి నిర్మలమ్మ ఇటీవల మృతి చెందగా పోచంపల్లి గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పాత పెన్షన్‌ను అమలుచేయాలి

మహబూబాబాద్ రూరల్ : పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మంగళవారం తెలంగాణ మున్సిపల్ సెంట్రల్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగు రమేశ్, స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జాతీయ కమిటీ సభ్యుడు మల్‌రెడ్డి రాజశేఖర్‌లు కలిసి విన్నవించారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని వారు కోరారు.

పోలీసుల అదుపులో అంగన్‌వాడీ కార్యకర్తలు

మహబూబాబాద్ రూరల్ /డోర్నకల్ /గార్ల : డోర్నకల్ మండలంలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని, మహబూబాబాద్ రూరల్, డోర్నకల్ పోలీసు స్టేషన్‌లకు తరలించారు. ఆయా గ్రామాలకు చెందిన కె.సంధ్యాకుమారి, వి.రమ్య, ఎం.కల్యాణిని అదుపులోకి తీసుకుని సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ గార్ల మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు నీలాదేవి, పద్మ, సరిత, సుజాత, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

నెల్లికుదురు : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని ఆకేరు వాగు బ్రిడ్జి సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రత్తిరాం తండా శివారు హనుమంతు తండాకు చెందిన గుగులోత్ కిషన్ తన ద్విచక్ర వాహనంపై తొర్రూరు నుంచి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కిషన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

నెల్లికుదురు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు



గూడూరు: అయోధ్యపురం జెడ్పీఎస్ఎస్‌లో..



విద్యార్థులే ఉపాధ్యాయులుగా..

జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మరిపెడ: స్వయం పరిపాలనలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు


మరిపెడ రూరల్: వీరారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో..


మహబూబాబాద్ రూరల్: పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

దంతాలపల్లి : చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన దొనికన సుభద్ర సొంత పనిపై సోమవారం దంతాలపల్లికి వచ్చి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్టాండ్ దగ్గర రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, వెస్ట్ గోదావరి జిల్లా కోయిలగూడెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ షేక్ మహ్మద్ జలానా వరంగల్ నుంచి ఖమ్మం వైపు లారీని అతివేగంగా నడుపుతూ సుభద్రను ఢీకొట్టాడు. కాగా, తీవ్రంగా గాయపడిన సుభద్రను 108 వాహనంలో చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందింది. మృతురాలి కుమారుడు నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.